బాల్యస్నేహం

౧

"మా సొంతగొడవలతోనే మాకు తలమునకలై వుంటే నీ గొడవకూడా ఎవరికి కావాలి" అని పాఠకులు నన్ను నిరుత్సాహపరచరని తలుస్తాను. ఈ నా కథలో నా సోదరీమణులు నేర్చుకోవాలిసింది ఏమీ వుండదని నేననుకోను. ప్రస్తుత మనేకమంది భారతీయ స్త్రీలకు మల్లేనే నాకుకూడా చదవనూ, వ్రాయనూ రాకపోయేవుంటే మిమ్మల్ని ఈ పది పదిహేను నిముషాలు ఇలా కూర్చోపెట్టగలిగేదాన్నికాను. మన తెలుగుభాషలో కాస్త అభిరుచీ భారత భాగవతాలు చదివి అర్థంచేసుకోగల శక్తీ నాకు మోహనరావనే బాల్య స్నేహితుడు కల్పించాడు. జన్మజన్మాంతరాలవరకూ అతనికి నేను కృతజ్ఞురాలను. ఏదో ఇంతజ్ఞానం ప్రసాదించి నా కతను ఆధ్యాత్మికసహాయం చేశాడు.

అతడు నాకు బాల్యస్నేహితుడన్నాను. అవును. అతనికుటుంబం మాకుటుంబం ఇరుగుపొరుగునవుండి చాలకాలంనుంచీ మైత్రితో వుండేవి. మేమిద్దరమూ అప్పుడు బాల్యోచితమైన ఆటపాటల్లో కలిసిమెలిసి వుండేవాళ్ళం. వాళ్ళనాన్న మమ్మల్ని రోజూ సాయంత్రంపూట పొలాలకేసి షికారు తీసికెళ్ళేవారు. మా అమ్మ నాకు పూలపరికిణీ, సిల్కుజాకెట్టూ తొడిగి పంపేది. నారాయణరావుగారి వెనకాలే మేమిద్దరము చెట్టాపట్టాలు పట్టుకొని ఏమో మాట్లాడుకుంటూ వెళ్ళేవాళ్ళం. చూచేవాళ్ళంతా చాల ముచ్చటపడి మాకు భార్యాభర్తల సంబంధం కట్టేశారు.

ఇరుగు పొరుగు ఆడవాళ్ళంతా నన్ను చూచినప్పుడల్లా "మోహనరావు భార్య" "మోహనరావు భార్య" అని నవ్వేవాళ్ళు. అప్పుడు నాకు ఉడుకుమోతుతనంవచ్చి కళ్ళనీళ్ళపర్యంతం అయ్యేది. మా అమ్మ నన్ను దగ్గరకు తీసికొని ముద్దుపెట్టుకొని చెంపలు దువ్వితే అంతా మరచిపోయి వాళ్ళతోటలో ఆడుకునేదాన్ని. అతడు పూలన్నీ కోసి నాచేతుల్లో పోసేవాడు. ఏమీ తెలియకని నా బాల్యహృదయం అప్పుడెంతో ఉబికిపోయేది. అసంతోషంలో తేడిలాగా మా అమ్మ దగ్గరకు పరుగెత్తుకొనిపోయి చెండుగుచ్చి నా జడలో పెట్టించుకుని మళ్లీవచ్చి నా స్నేహితునికి చూపించేదాన్ని.

ఈ బాల్యమిత్రుడు నా భర్త కావాలన్న వుద్దేశం నాకెప్పుడూ లేదు. అతన్నే నేను వివాహం చేసుకుంటే అతనిమీద నాయిప్పటి అధికారమూ, చనువూ ఉండవని అనుకునేదాన్ని. అతడు హైస్కూలుకు పోతూవుంటే మాయింటిచావడిలో నిల్చొని కనుపించే అంతవరకూ పేరుపెట్టిపిలుస్తూ అల్లరిచేయడానికి వీలుండదని నావూహ. ఇప్పుడు మల్లే పుస్తకం చేతపట్టుకపోయి అతని తొడమీద కూర్చుని పాఠం చెప్పించుకోటానికి ప్రతిబంధకమౌతుందని నా ఉద్దేశం. స్వామిరావుగారి కూతురులాగా పందుగకు మొగడువస్తే గదిలోనే బియ్యపుబస్తాచాటున దాగికొని ఉండాలేమోనని నాభయం. అందుచేత నేను మోహనరావును పెండ్లి చేసుకోవాలని అనుకోలేదు. దాంపత్యబాంధవ్యం కంటే ఒక ఉత్కృష్టసంబంధం మా యిద్దరినీ బంధించివున్నదనిమాత్రం నా హృదయంలో ధ్వనించేది.

నా స్మృతిపథంలో ఎక్కడో దూరాన్న మసక మసకగా కనుపిస్తూన్న నా బాల్యదశలో విద్యుద్దీపాల్లాగా ప్రకాశిస్తూన్న కొన్ని అనుభవాలు మాత్రమే మీకు చూపిస్తున్నాను. పాఠక సోదరీమణుల హృదయాలు ఈ సమయంలో, తమకుగూడా ఇల్లాంటి అనుభవాలున్నాయేమోనని, ఒక్కసారి తమ బాల్యావస్థకేసి చూచుకుంటున్న వనుకుంటున్నాను. కొందరు నా అప్పటి సౌఖ్యజీవితానికి అసూయపడుతూ ఉండొచ్చు. కాని తరువాత వినండి.

మోహనరావప్పుడు మెట్రిక్యులేషన్ క్లాసులో చదువుకుంటున్నాడు. అతడు చాల అందగాడనీ, నాకు తగిన వరుడనీ, ఆడవాళ్ళంతా మాయింట్లో మాటింగు చేసినప్పుడల్లా అనుకుండేవాళ్ళు. కాని నేనుమాత్రం

అతని సౌందర్యం ఎప్పుడూ విమర్శించలేదు. నిండా పూచివున్న గులాబిచెట్టు చూస్తే నాకంటికింపుగానే వుంటుంది. సూర్యుడస్తమిస్తూన్నప్పుడా రంగులు చూస్తే మానవాతీతమైన ఒక శిల్పిహస్తం నాకు స్ఫురించేదే. సాయంకాలం షికారుపోయినప్పుడా పొలాల్లో నాకానందంగానే వుండేది. కోయిల కూసినా, పిట్టలు బార్లుకట్టి ఆకాశమార్గాన ఎగిరిపోతున్నా, ఉత్సాహంతో నా స్నేహితునికిగూడా చూపించేదాన్ని. కాని ప్రకృతిసౌందర్యమంతా మనుష్యవ్యక్తిలో కూడా ప్రత్యక్షమై వుంటుందని అప్పటి నా బాల్యహృదయానికి తోచనేలేదు. అంచేతనే మోహనరావు శరీర సౌందర్యం నన్నాకర్షించలేదు. ఇతరబాలురకంటే అతడు చాలా మంచివాడనిమాత్రం నామనస్సు చెప్పేది. గొప్ప తెలివైనవాడనికూడ నమ్మకం. అందుకు మెట్రిక్యులేషన్ పరీక్షలో ఆస్కూల్లోకల్లా ప్రథముడుగా కృతార్థుడుకావడం సాక్ష్యం.

నారాయణరావుగారొక రిటైర్డుఉద్యోగి. ఆయన్ని అందరూ ఎరుగుదురు. కాని ఆయనతో ముఖాముఖి పరిచయంకలవాళ్ళు తక్కువ. ఆయనది మితంగా మాట్లాడే స్వభావం కాలానుసరణంగా సంఘంలో మార్పు అవసరమనే వారిలో ఒకరైనా-'సంస్కర్త' అనే పేరు కోసం ఆయనెప్పుడూ ఏమైదానంమీదా ఉపన్యాసం ఇచ్చియుండలేదు. ఆయనమీద ఆధారపడియున్న సంస్థ ఒకటీలేదు. వచ్చే 'పెన్షన్'తో ఆయన ప్రశాంత జీవితం గడుపుకుంటున్నాడు. ఉద్యోగంచేస్తున్న రోజుల్లో సంపాదించిన డబ్బు చాలావరకు బ్యాంకులోవున్నదని వదంతి. ఎలాగున్నా మోహనరావుమాత్రం ఒక గొప్ప ఆస్తికి వారసుడు. అందుచేతనే పరీక్షాఫలితాలు తెలిసిన తరువాత మానాన్న నన్ను మోహనరావుకిచ్చే విషయాన్ని నారాయణరావుగారితో కదిపేడు. అమ్మకూడా నారాయణరావుగారికుటుంబముతో సంబంధం చేసే విషయంలో చాలా ఉబలాటపడుతూనే వుంది. నాకుమాత్రం పెండ్లిఅంటేఎందుకో అర్థంకాలేదు. పైగా అసహ్యకరమగు బండికాడిలా కనుపిస్తున్నది.

మోహనరావు తాను బి. ఏ ప్యాసయ్యేటంత వరకూ పెండ్లిచేసుకోనని వాళ్ళనాన్నతో గట్టిగా చెప్పేశాడు. అందుచేత నారాయణరావుగారికి మానాన్న వేసిన మంత్రం పారలేదు. మావివాహం జరుగలేదు. నాప్రియమిత్రుడు ఇంటర్మీడియేటు చదివేనిమిత్తం మద్రాసు పోయాడు. అప్పటికి నేను పదునొకండు వసంతకాలాలు మాత్రమే చూచివున్నాను.

౨

ఆధ్యాత్మికశక్తికీ, పరమాత్మకూ ఉండే సంబంధాన్ని వ్యక్తీకరించి భార్యాభర్తలకు ఈ ప్రాపంచిక జీవితంలో ఒక చైతన్యాతీతజ్యోతిని ప్రత్యక్షం చేయడమే వివాహముయొక్క ముఖ్యోద్దేశం. వివాహమనేది స్త్రీ పురుషుల ప్రత్యేకశక్తులను ఏకంచేసి ద్విగుణీకృతోత్సాహంతో కార్యరంగంలో పనిచేయిస్తుంది. కాని ఇప్పుడు ఆశయానికీ ఆచరణకూ చాలదూరం వున్నది. కేవలము జంతువులవలె కామముతీర్చుకునేటందుకూ, చచ్చిపోయాక శ్రాద్ధాలు పెట్టేనిమిత్తం కుమారుణ్ణి కనేటందుకూ మాత్రమే పెండ్లి చేసుకుంటే వివాహోద్దేశం నెరవేరిందని చెప్పలేము. ముఖ్యంగా మన హిందూదేశంలో వివాహమనేది అనేక యువతీయువకుల పురోభివృద్ధికి ఆటంకమౌతున్నది. చెప్పుకోటానికి సిగ్గౌతున్నది—చిరకాలమునుంచీ ఆధ్యాత్మిక దేశమంటూ పేరెన్నికగన్న మన ఆర్యావర్తంలో వరశుల్కాలతోను, కన్యాశుల్కాలతోను ముక్కుపచ్చలారని పసిపిల్లల రక్తమాంసాలు కొనుక్కుంటున్నాం.

పన్నెండు సంవత్సరాల యీడుగల ఆడపడుచు భారతగృహస్థుని కంఠభారంగా వుండడానికి కేమిటి కారణం? నాపెండ్లికోసం మానాన్న అంతగా మథనపడటమెందుకు? ఆ యీడులో పెండ్లికాని ఆడపిల్లలు నేనుతప్ప మరెవ్వరూలేరని నలువురూ అనుకుంటూంటే మాత్రం మనంచేసిన పాపకార్యం ఏమున్నది! అయినా, నాకప్పుడు వివాహంచేయడమనేది నాకుగాని, మానాన్నకుగాని అవశ్యకమైనదని సహేతుకంగా ఎవరు చెప్పగలుగుతారు?

నా వివాహవిషయమై మా తండ్రిగారు స్వయంగా కల్పించుకున్న దిగులుతో పెండ్లికుమాళ్ళకోసం అంగళ్ళ

వెతుకుతున్నాడు. నేనేవో చిన్నచిన్న పుస్తకాలు తేలిగ్గా అర్థమయ్యేవి చదువుకుంటూ కాలంగడిపేదాన్ని. ఎక్కడైనా సందేహమువస్తే నారాయణరావు గారి దగ్గరకుపోయి నివృత్తిచేసికొనేదాన్ని. మోహనుడు వెళ్ళినప్పటినుంచీ ఈ విశాలప్రపంచంలో నేనొక్కదాన్నే వున్నట్లనిపించేది. అతడు పోతూ నాజీవితమాధుర్యాన్నికూడా తీసికెళ్ళినట్లున్నాడు.

ఈ ప్రపంచములోని ప్రాణశక్తుల అన్నింటిచలనము ఈ అఖిలవిశ్వము వెలుపటనున్న ఒక అనంతప్రాణశక్తిపై ఆధారపడివున్నదని తోస్తుంది. దేశకాల నిమిత్తాలతో బంధింపబడివున్న సామాన్యమానవహృదయం ఆ అనంతప్రాణశక్తిని తనయిచ్ఛకు లోబరచుకోలేదు. అందుకనే లోకంలో అనుకున్నది జరక్క విరుద్ధ ఫలితాలు కలుగుతూండటం. ఆమధ్య అకస్మాత్తుగా మా మేనమామ భార్య చచ్చిపోయినప్పుడు,—ఎలాగైనా నన్ను మోహనరావు చేతుల్లోనే పెట్టాలని దృఢాభిప్రాయంతో వున్న మా అమ్మకూడా ఒక్కసారి మారిపోయింది. అకస్మాత్తుగా ఇప్పుడు తన అన్నగారి కొకపెద్దవిపత్తు సంభవించిందనీ, నావంటి పెండ్లికీడేరినకూతురు తనకున్నప్పుడు ఆ సమయంలో తన అన్నయిల్లు నిలబెట్టకపోతే నలుగురూ నోట్లో వుమ్మివేస్తారనీ, ఆమె చాలసార్లు మా నాన్నతో చెప్పింది. ఆయనమాత్రం ఈడూజోడూకాని సంబంధం చేయజాలనని గట్టిగా చెప్పుతూవచ్చాడు. అందుచేత మా యింట్లో కొన్నాళ్ళవరకూ అంతఃకలహాలు రేగినై. మా నాన్న చాల కలవరపడ్డాడు.

మా మామ మమ్మల్ని చూడ్డానికి మా యింటికి వచ్చాడు. ఆయనకు జీవితంలో ముప్పాతికభాగం వెళ్లిపోయింది. ఇక జరాక్రాంతం కావలసిన ఒకపాతికపాలు మాత్రమే వున్నది. చిన్నప్పుడాయన నన్ను తనకూతురులాగా ఎత్తుకొని ఆడించి అదీ ఇదీ కొనిపెట్టినవాడు.

ఒకనాడు నేను వంటయింటిగుమ్మంలో నిల్చుని మా అమ్మ కూరగాయలు తరుగుతూంటే చూస్తున్నాను. మా మామవచ్చి నాబుగ్గ పొడిచి "ఏంవే పిల్లా! నన్ను పెండ్లిచేసుకుంటావా? చాల సొమ్ములు పెట్టుతాను" అంటూ నవ్వేడు. ఆ అనార్యశృంగారానికి మా అమ్మకూడా నవ్వింది. నేను సిగ్గభినయింపలేదు రంగంలో. అసహ్యంకలిగింది.

మా మామ చాలధనవంతుడే. గుంటూరులో ఆయన కొక పెద్దమేడ వున్నది. ఆ మేడలో నేనిక కాపురం చేయబోతానని మా అమ్మకు సంతోషమే. ఈడూ జోడు విషయంలో అల్లాంటి పెండ్లిళ్ళు అనేకం జరుగుతూనేవున్నవని ఆమె సమాధానం.

ఒకచెంప భార్య వుపన్యాసాలూ, మరోచెంప బావమరిది బ్రతిమిలాడటం, మరోవంక ఆర్థికపరిస్థితి క్లిష్టంగా వుండటం,—అన్నీకలసి మా నాన్నను కలవరపెట్టినై. రోజులుగడవగా చెల్లాచెదరై అతని హృదయంలో తికమకలుగా పరుగెత్తుతూన్న ఆలోచనలన్నీ చివరకు మా అమ్మ అభిప్రాయంతో ఏకీభూతమైనవి.

పెండ్లికి మా నాన్న కంతగా ఖర్చుకాలేదు. వివాహయజ్ఞం పూర్తిఐంది. దానికి ఆహుతీ అయిన యజ్ఞపశువును నేనే.

3

వివాహమైన మూడునెలలుకూడా పూర్తిగా నిండకముందే మా మామ నన్ను తన అదుపు ఆజ్ఞల్లో వుంచుకునేటందుకు నాకేవో కొన్నిపాఠాలు నేర్పుకుంటానని గుంటూరు తీసికొనివచ్చాడు. కాని మా మామ శరీరపరిస్థితి ఆరోగ్యమైనది కాదని మీకిదివరకే చెప్పియుండవలసినది. ఆయనకు మొదటిపెండ్లి అయినా, ఈడుముదిరిన తరువాతే జరుగుటకుకూడా ఆయన చిన్నతనంలో చేసిన దుందుడుకుపనులే కారణం. ఆనాటి తన చెడుప్రవర్తనకు ఫలం, మా మామ నేడనుభవిస్తున్నాడు. మూడు సంవత్సరాలనుంచీ ఆయన మంచం దిగడంలేదు ; పక్షపాతంవచ్చి కాళ్ళూ చేతులూ పడిపోయినై. లేచి రెండడుగులు వేయడానికికూడా శక్తిలేదు. మలమూత్రవిసర్జనాదులుకూడా మంచందగ్గిరే. ఈ కర్మవిపాకానికి నేనాయన యింట్లో కాలుపెట్టిన వేళావిశేషమని కొందరన్నారు. నిజంగా ఒకని సుఖదుఃఖాలు మరోవ్యక్తియొక్క పాదచిహ్నాలమీద ఆధారపడి వుండేయెడల నేను ద్రోహినే.

ఈ మూడేండ్లనుంచీ గుంటూరులో నాజీవితం సుఖమయమైనదని చెప్పలేను. అట్లని మా మామమీద నే నేవిధమైన దోషారోపణా చేయజాలను. ప్రతిరోజూ మధ్యాహ్నముపూట భోజనాత్పరం నేనాయన మంచం దగ్గిర కూర్చొని కాళ్ళుపిసికేదాన్ని. అప్పుడాయన పడుకునివుండీకూడా నన్ను దగ్గరకుతీసికొని, ముద్దెట్టుకునేవాడు. నన్నెత్తుకుని ఆడించిననాటివాత్సల్యం నాయందు మామామకు పూర్తిగా వున్నదికదా అనితృప్తిపడేదాన్ని. ఆయన పరిచర్యలో ఏమరివుండేదాన్ని కాదు.

నాకు పదునారేండ్లు వచ్చినవి. సావిత్రీ, దమయంతీ మొదలైన పతివ్రతల కథలు నాచేత చదివించేవాడు మా మామ. సుకన్యోపాఖ్యానమంటే ఆయనకు చాలా యిష్టం. నేను స్వచ్ఛంగా, స్ఫుటంగా చదువుతూంటే ఆయన ఆశ్చర్యపోయేవాడు. అప్పుడు నేను నాచిన్ననాటి గురువును మోహనరావును జ్ఞాపకంతెచ్చుకుని నారాయణరావుగారి కుటుంబముతో మా మామకు పరిచయంచేసేదాన్ని. అలా మోహనుని గుణకీర్తన చేయడంలో నే నొక కవయిత్రి నైపోతున్నానా అనుపించేది. కాని నాకవిత్వం మా మామ హృదయంలో వేరభిప్రాయంతో ధ్వనిస్తుందని నే నెప్పుడూ అనుకోలేదు.

ఒకనాడు నన్నాయన ప్రశ్నించాడు: "పిల్లా! ఒకవేళ నేనీవ్యాధితో చనిపోయే యెడల మళ్ళీ ఎవరిని పెండ్లి చేసుకుంటావు? మోహనరావును..."

"మామా! దిగులుపడకు. నాజాతకంలో అసలు పెండ్లిఅంటూ లేనేలేదు."

"ఒకమారైందిగా."

"అది నేను కోరివుండలేదు నీవే నన్ను వివాహమాడేవు."

ఈ మాటలు మా మామ ఏవిధంగా అర్థంచేసుకున్నాడో నే నూహించలేదు. ఆయన ముఖవైఖరిలో కొంచెం మార్పుకలిగింది. "నీవుమాత్రం పాశ్చాత్యనాగరకతా తరంగంమీద చలిస్తూన్న ఆధునికస్త్రీలోకా కి చెందిన దానవు కావా?" అంటూ కన్ను మూసికొన్నాడు.

ఆయన కేమో కోపం వచ్చిందని గ్రహించాను. నా అజ్ఞానాన్ని క్షమించమంటూ ఆయన్ని అనునయించాను, నారింజపండ్లరసం పిండినగ్లాసు ఆయన పెదవులకందిస్తూ.

నాటినుంచీ స్త్రీల సౌశీల్యాన్ని శంకించే వాళ్ళు విధించే కట్టుబాట్లకు నేనూ లోనుగావలసి వచ్చింది. మనుష్యవ్యక్తి కొన్నికట్టుబాట్లలో వుండడమనేది మంచిదే. కాని ఆకట్టుబాట్లు వ్యక్తిత్వాన్ని నశింపచేసేవైతే దేశాభ్యుదయంలేదు.

ఆ విశాలమైన భవనంలో మేమిద్దరమే కాపురం ఉంటున్నది. అప్పుడప్పుడు జయప్రదాదేవివచ్చి నాకు లోకాభిరామాయణం చెపుతూ ఉండకపోతే నాకు ప్రొద్దుపోయేదేకాదు. ఆ అమ్మాయి చాల తెలివితేటలుగలపిల్ల. పదునాల్గేండ్ల చిరుతప్రాయంలో అందులో స్త్రీకి అంత ప్రపంచజ్ఞానం ఉండటమనేది చాల అరుదైనవిషయం. ఆమెభర్త కీపూళ్ళో గోతాలమిల్లులో పని. వాళ్ళీవూరువచ్చి ఆరునెలలు కావస్తున్నది. మాయింటిప్రక్కనే కాపురం ఉంటున్నారు.

జయప్రదతో నాకు స్నేహంకలసి నప్పటినుంచీ, జీవితం చాలభాగం సంతోషంతోనే గడిపేస్తున్నాను. ఆమె సహజంగా హాస్యప్రియ. ఆమె వాక్చాతుర్యం మరోవ్యక్తికి బాధాజనకంగా ఉండదు. ఆమె నవ్వితే మరెవ్వరినీ ఎగతాళి చేసినట్లుకాదు; మనంకూడా ఆమెతోపాటు నవ్వేస్తాం హృదయం తేలికయ్యేటట్లు. నే నామెను 'జయం' అని చనువుగా పిలుస్తాను.

ఎందుచేతనో ఆమధ్య మాయింటి కామె రావడం మానేసింది అయిదారురోజులు. నా కేమీ తోచలేదప్పుడు. ఒంటరిగా ఖైదీకిమల్లే కాలంగడిపేను. ఎందుచేత రాలేదో అని పరిపరివిధాలా ఆలోచించాను. ఆ నాలుగురోజులూ నాకు యుగాల్లాగా తోచినై.

ఆమె రాకపోతే నేనన్నాపోయి పిలుచుకునివద్దామని ఆనాడుమధ్యాహ్నం బయలుదేరాను. సూర్యుడు మబ్బుచేత ఆచ్ఛాదింపబడివున్నందున ఎండనిపించలేదు. అయినా దూరముకాదు కనుక శ్రమ అనుపించలేదు. చివర కామెయింటివద్దకు చేరుకున్నాను. లోన గడియ వేయబడియున్నది తలుపు.

తలుపుతట్టబోతూ 'జయం.' అని కేకవేయ సిద్ధముగా వున్నాను. ఇంతలో గవ్వలు గలబరింపినట్లుగా

ఆమెనవ్వు నాకు వినుపించినది. తలుపుసందులోనుంచి లోనికి తొంగిచూచా. ఆమెభర్త హాల్లో ఒక పడక కుర్చీమీద కాళ్ళుచాచుకుని పడుకున్నాడు. అతనిఒడిలో ముద్దులు మూటకట్టుతూ కూర్చున్నది జయం. ఏ పరి యాచకమాడి భర్తనువంచించి నవ్వుతున్నదో ఆవిలా సిని! అది ఆ ఏకాంతవాసులకే తెలియాలి.

అంతా చూచాను. నా కన్నుల కది అపూర్వప్రదర్శ నమైపోయింది. అలాగేచూస్తున్నా. నాశరీరము కంపిం చుతున్నది; భయముకాదు. ఒడలు గరు దాల్చినది; కోపముకాదు.

బలవంతముగా నాశరీరమును ఎట్లో మోసికొనిపోయి ఇంటికిచేర్చితిని. కొంతసేపు పండుకుని లేచునప్పటికి మరల తేరుకున్నాను.

౪.

మరునాడామె మా యింటికి వచ్చినప్పుడు నాహృదయముప్పొంగిపోయింది. ఇల్లంతా కళకళలాడింది. నా గదిలో పాలగచ్చుచేసిన నేలమీద చిరిచాపపరచి ఆమెను కూర్చోబెట్టి అడిగేను:

"ఏమమ్మా! జయం! ఇన్నాళ్ళనుంచీ నామీద శీతకన్ను వేశావూ! మీవారు మా యింటికి రావద్దని చెప్పేరా?"

'ఆశ్చర్యంగావుంది మీరడిగిన ప్రశ్న' అంటూ ఆమె మందహాసంచేసింది.

"ఏమి! అల్లాంటి అధికారం భర్త భార్యమీద చలాయించుకుంటే తప్పా? శృంగారించుకుని గుమ్మములో నిల్చుండరాదనీ, పరపురుషునితో మాట్లాడకూడదనీ, పొరుగింటికి పోవద్దనీ భర్త భార్యకు విధించడం సహజం!"

"అనూయాగ్రస్తుడైన ఒకానొక వ్యక్తి విధించేక్రూర చట్టాలతో మగజాతికంతకూ శాశ్వతమైన కళంకాన్ని ఆపాదిస్తున్నావు. మావారెప్పుడూ నన్ను నిర్బంధపెట్టరు. ప్రేమ స్వేచ్ఛలోనే వృద్ధిచెందాలని మాఉద్దేశం."

"మరి నీవు మాయింటికి రాకపోవడానికి కారణం?"

"మొన్న క్రిస్తవులహోళ్ళ్వెస్టుపండుగ. యజమాని క్రైస్తవుడు కనుక 'మిల్లు'కు ఆదివారంతోసహా నాలుగురోజులు సెలవువచ్చింది. అంచాత దొరక్క-దొరక్క దొరకిన అవకాశాన్ని పోగొట్టుకోకుండా ఇద్దరమూ ఆటపాటల్లో గడిపేవాళ్ళం కాలం. సాయంత్రం రోజూ సినీమాకు వెళ్ళేవాళ్ళం మొదటిఆటకు."

"నామీద కోపం వచ్చిందేమో అనుకున్నానుసుమా?"

కాదు. మావారింట్లోఉంటే ఎకచకలతో, పకపకలతో మాకంతలో ప్రొద్దు కృంకిపోతుంది అందుకనే మాకు చిల్కా-గోరింకలని పేరెట్టింది మా బామ్మ."

అంటూ గలగలా నవ్వింది జయం. ఆ నవ్వు మా విశాల భవనంలో తరగల్లా వ్యాపించిపోయి మా మామ చెవుల్లోకూడా దూరిందేమో, 'ఎవరితో పిల్లా! నీ సల్లాపాలూ' అంటూ ప్రశ్నించాడాయన నన్నుద్దేశించి.

"నేనేనండీ! తాతగారూ! జయప్రదను." అని జవాబిచ్చింది ఆచిన్నది.

"ఆయన నీకు తాతగారైతే, నేను నీకు అమ్మమ్మనా? నాయనమ్మనా?' అని అడిగేను నేను ఆమె బుగ్గమీద మెల్లిగా తట్టుతూ

"నీవు నాచిన్నక్క-య్యావు."

"ఎలాగా?"

"నేను వయసునుపట్టి వరుస నిర్ణయిస్తాను."

ఆమెమాటలు నాకర్థంకాలేదు. గుమ్మంకేసి శూన్య దృక్కులు పారేస్తూకూర్చున్నా. సాయంకాలపు పైరగాలి చల్లగావీస్తూ మా జయప్రదాదేవి తలవెంట్రుకలతో ఆడుకుంటున్నది. కాస్సేపు మేమెవ్వరమూ మాట్లాడలేదు. ఇంతలో గోడమీది గడియారము ఐదు గంటల తరువాత అరగంటకొట్టింది. జయం వెంటనేలేచి "అక్కా-! నేనుపోతా. మావారు ఆఫీసునుంచివచ్చే వేళైంది. వారి స్నానానికి వేన్నీళ్ళు కాచాలి," అంది.

నేను నవ్వుతూ తమాషాగా అన్నాను. "నాగరికత వడిసిన నీవంటి ఇరవయ్యోశతాబ్దపు పిల్లకూడా అల్లాంటి పనులు చేయవలసిందేనా? పురుషులు స్త్రీలను ఋానిసల్లా వుపయోగించుకుంటున్నారని నీచెప్పుడూ అనుకోవూ?"

"అది స్త్రీ తత్వం తెలీనివాళ్ళు పుస్తకాల్లో వ్రాసినమాట; నీవెక్కడో చదివివుంటావు. నా అనుభవంలోమాత్రం భర్తృసేవ చేస్తున్నప్పుడు నేనొక

దాసీదాన్నని నేభావం నాకెప్పుడూ కలుగదు. భర్తృ సేవకు నన్ను ప్రేరేపేది నా హృదయంలోవున్న ఒక అనిర్వాచ్యమైన ప్రేమజ్యోతి. మావారికి సేవచేసే అవకాశం దొరుకుతే నాకు సంతోషం ''

ఆమెవాక్యాలు మంత్రాక్షరాల్లాగా నన్ను ముగ్ధురాలిని చేసివేసినై. వాటిఅర్థం నాకు పూర్తిగాతెలియ లేదు. నాకు అగమ్యగోచరంగావున్న ఒకక్రొత్త విషయమేదో ఆమెకు పూర్తిగా అనుభూతమైవున్నదనిమాత్రం నాకు రూఢిఅయింది.

౫

ఆరాత్రి నాకు చాల ప్రొద్దుపోయేటంతవరకూ నిద్ర పట్టలేదు. ఏవో పరస్పరవిరుద్ధములైన అనేకభావాలు నా హృదయంలో పరువెత్తినవి. దీపమార్పుకుని నా గదిలో మంచంమీదపడుకున్నా.

"జయప్రదాదేవికీ, నాకూ మంచిస్నేహంవున్నా, మా యిద్దరికీ, ఉత్తరదక్షిణ ధృవాలమధ్యవుండే అంత అంతరం వున్నది. ఆమెది కేవలం సంతోషమయమైన జీవితం. ప్రపంచ మామె కొకనందనవనం. శరత్కాలపు వెన్నెల ప్రామికొని శోభాయమానముగనున్న ఒక మైదానమున తన సౌధము నిర్మించుకున్న దామె. అంధకారమంతా పుంజీభూతమైవున్న గహ్వరా లామె ఎన్నడూచూడలేదు.''

"ఆమె హృదయంలో ప్రేమతత్వాన్ని గుతించిన అనేకగ్రంధాలు వ్రాయబడిఉన్నవి. ప్రేమ అనే రెండక్షరాలూ ఆమె వుచ్చరించినప్పుడు ఆమెనోట అమృతం చిందుతుంది. ఆమెకన్నులు తేజఃప్రపూరితము లౌతవి.''

"ఆమెకు తనభర్తయెడల భావము నాకనుభవము కానిది. ఆమె భర్తను సేవిస్తుంది ; అందువలన ఆమెకు ఆనందం కలుగుతుంది. ప్రేమజ్యోతిట, ఆమెను భర్తృసేవకు ప్రేరేచేది.''

"ఆమె నాతో సంభాషిస్తూన్నప్పుడు ఆమె నావ ఆనందవాయువుతోడై ప్రవాహవేగంతో కలసి చల్లగా నడచిపోతుంది. నా పడవ హఠాత్తుగా ఒకరాతికి తగులుకుని అభాగ్యం సూచిస్తుంది.''

ఇల్లాంటి ఆలోచనలతో రాత్రి చాల ప్రొద్దుపోయే టంతవరకూ నిద్రపట్టనికారణంచేత తెల్లవారి లేచేసరికి చాల నీరసంగావుండింది శరీరం. నిద్రకండ్లు నులుముకుంటూపోయి మేడమీది కటకటాలముందు నిల్చుని ఉత్తరపువేపు బయలు అవలోకించా కాస్సేపు. అది హేమంతఋతువు కాబట్టి దట్టముగా అల్లుకునివున్న మంచుతెరలన్నీ అప్పుడేప్పుడే మెరుస్తూన్న సూర్య రశ్మికి విచ్చిపోతున్నవి. గడ్డిమీద మంచుబిందువులు కొన్ని ముత్యాలవలె మెరుస్తున్నవి. దిక్కులన్నీ అజ్ఞానంలోనుంచి వెలుపలకు వస్తున్నట్లు తెలివి పొందుతున్నవి. నా హృదయంలో రేగుతున్న ఈ అవ్యక్తబాధ మాత్రం శాంతించలేదు. ఏసుతిమెత్తని హృదయతంత్రి మ్రోగుచున్నదో, ఏతీరని కోర్కె కలవరపెట్టుతున్నదో నాకే పూర్తిగ అవగతమగుచుండుట లేదు.

౬

మళ్ళీ ఎన్నాళ్ళకో నా పుట్టింటికి రాగలిగేను. మా తమ్ముని వుపనయనమంటూ మానాన్నవచ్చి నన్ను తీసికొనివచ్చాడు. గుంటూరులో మా మామకు వుపచారం చేయడానికి ఆయన పినతల్లికూతురును—విధవావిడను ఉంచివచ్చాము. తిరిగీ నన్ను త్వరగా పంపేయమనీ, ఆడపిల్ల పుట్టింట్లో అట్టే చాలకాలం వుండరాదనీ, మానాన్నకు మా మామ ధర్మోపదేశంచేసి నాకు సెలవిచ్చాడు.

నేను మావాళ్ళింటికిరాగానే నన్నుచూడ్డానికి ఇరుగుపొరుగు అమ్మలక్కలంతా వచ్చారు. నాలుగేండ్ల నుంచీ నన్నుచూడనందున కొందరు నన్ను గుర్తించలేక పోయారు. "ఏమేపిల్లా! ముగుడంత తీపయ్యాట్టే. ఇన్నాళ్ళూ పుట్టిల్లు జ్ఞాపకంవచ్చిందికాదే'' అంటూ ఒక ముసలావిడ పరియాచకంచేసింది. "నాలుగేండ్లు కాపురంచేసినాకూడా ఒక్కగుంటడూ చంకకు రాలే దేమే'' అంటూ ఒకావిడ బుగ్గపోటు పొడిచింది. "ఎల్లకాలమూ గోగుకాడలా అల్లాగేవున్నావు ; లావు పడలేదే'' అంటూ ఓ పెద్దముత్తైదువ కుశలప్రశ్న. ఎవరికి తోచినట్లు వాళ్ళు పల్కరించారు.

జయప్రదాదేవి నా దగ్గిరవుంటే వీళ్ళందరకూ తగినట్లు జవాబిచ్చేదికదా అనుకున్నా. ఆ అమ్మాయిని కూడా రమ్మని చాల బలవంత పెట్టేను. కాని తనభర్తకు

పోటలుతిండి పడదనీ, స్నానపానాదులు సరిగ్గా జరగవేమోనని ఆమె భయపడ్డది.

నేను బయలుదేరేరోజున బండీ ఎక్కేవరకూ, ఆమె నాతోనేవున్నది. ఆనాడామె నాకు తనచేతులతో జడ వేసి, తగినచీర ఒకటి పుర్మాయించి, అలంకారమంతా ముగిసిన తర్వాత నన్ను నిలువుటద్దంముందు నిలబెట్టి "చూచుకో అక్కా! నీ సౌందర్యం నిజంగా మూడు లోకాలనూ మోహింపజేస్తుంది" అన్నది, చూచుకున్నా. పూర్వం నారాయణరావుగారి వెనకాల మోహనరావుతో కలిసి షికారువెళ్ళినప్పటి నాకూ, ఇప్పటినాకూ, చాలా భేదంవున్నది. నా కన్నుల్లో ఒకవిధమైన తేట ప్రబలిపోయింది. నిజంగా నా తలవెంట్రుకలలోని నిగనిగ ఆకర్షణీయంగానే ఉన్నది. నా వక్షోభాగమున్నతమై, సన్నని నడుంమీద ఆధారపడివుండటము ఒక మనోహరమైనమార్పు. నా శరీరంలోని ఈ పరిణామమంతా ఎందుకొరకో అనుకున్నాను. జయప్రద, చిరునవ్వు నవ్వుతూ "అక్కా! నీసొంపు చూచుకుని నువ్వే సిగ్గుపడతావెందుకూ" అన్నది. ఆమెభావాలు ఆమెకే తెలియాలి.

చివరకు నాస్నేహితురాలి కౌగిలి విడిపించుకుని, బండీ ఎక్కేను. స్నేహపిచ్ఛిలమైన ఆమెహృదయం రెండు కన్నీటిబొట్లు రాల్చింది.

నేను పుట్టింటికి చేరుకున్న మరునాడు సాయంత్రం పూట నారాయణరావుగారి దర్శనం చేసికొందామని వారియింటికి పొయ్యాను. అప్పుడు వారిగదిలో లేరాయన. 'అయ్యగారు తోటలోవున్నారమ్మా' అనిచెప్పేడు వాళ్ళనౌకరు.

నేను సరాసరి తోటలోకి వెళ్ళుతూండగా మధ్య హాల్లో దక్షిణపువైపుగదిలో మోహనరావు కూర్చొని ఉంటే చూచాను కుర్చీలో. అతడు నన్నుచూడగానే 'సుశీ, సుశీ!' అని పిల్చేడు. ఆపిలవడంలో చిన్నప్పుడతనికి నాయెడవున్న చనువంతా బయటపడింది. కాని నన్నుమాత్రం సిగ్గనేదివచ్చి ముంచుకున్నది. నేనతన్ని కన్నెత్తి పూర్తిగా చూడలేకపోయాను. కాని ఆచూచిన క్షణంలోనే, అతని నూనూగుమీసమూ, బలిష్ఠములైన అతని శరీరసౌష్ఠవమూ నామనసున కెక్కినేఎక్కినవి. నూత్నయౌవనము ముఖద్వారమునకు వచ్చాడతడు.

గదిలోకి వెళ్ళడమా? వెళ్ళకపోవడమా? సిగ్గేమో 'వద్దులే, వద్దులే' అంటున్నది. మాపూర్వపరిచయమేమో 'అతనిపిలుపు నిరాకరిస్తివా ఆతడు చిన్నపుచ్చుకుంటాడు సుమా! మీరు స్నేహితులేగా. చిన్నప్పుడతనితో ఆడుకోలేదూ నీవు. ఇప్పుడైనావెళ్ళితే తప్పులేదులే' అంటున్నది.

ఎటూపోలేక అక్కడే కాస్సేపు నిల్చున్నా. మోహనరావే లేచివచ్చి నాచేయిపట్టుకుని 'రా. సుశీ! నన్నప్పుడే మరచిపోయావా?' అంటూ లోనికితీసుకొనిపోయి. కుర్చీలో నన్ను తనతొడమీద కూర్చోపెట్టుకున్నాడు. నాకేమో కొంచెం భయంభయంగావుండింది.

అతడు నా వీపుదువ్వుతూ 'జన్మజన్మాలకు కూడా మనము విడిపోవకుండా మనలను చిన్నప్పుడే బంధించివైవలేదూ మన బాల్యస్నేహం! వచ్చిన అవాంతరాలన్నీ నశించిపొయ్యావే' అన్నాడు మందస్వరంలో. ఔనని రాయిగ్రుద్ది చెప్పుతున్నట్లుగా నాహృదయం దడదడశబ్దంచేసింది. అతడు నన్నుగట్టిగా హృదయానికదుముకున్నాడు.

చెట్టుమీదనుంచి సీమరేగుపండు క్రిందపడితే న్యూటన్ మహాశయునికి ఒకగొప్ప ప్రకృతి సత్యము గోచరమైనట్లు, మోహనరావు వాక్యమువలన ఆసమయంలో నాకు జీవితరహస్యమంతా గోచరించింది. నా ఆత్మమీది ఒకముసుగు విడిపోయి అనంతలోచనములు విప్పినట్లయింది. నా కెఱుకపడకుండ హృదయంలో ఇన్నాళ్ళనుంచీ అణగివున్న కొన్నిరహస్యవిషయాలు వెలుగులోనికి వచ్చినవి. కనుక్కున్నాను: నాఆత్మ ఇన్నాళ్ళనుంచీ మథనపడుతున్నది ఈ పుణ్యమూర్తికోసం, ఈ సౌందర్యపురుషునికోసం. అతని విశాలవక్షంలో తల జూనిపి, అప్రయత్నంగా నాచేతులతో అతనికంఠము పెనవైచుకొని పండుకున్నప్పుడు శరీరమే మరచిపొయ్యాను; జీవితసౌఖ్యమంతా ఆక్షణంలోనే అనుభవించాను.

—పురాణం కుమారరాఘవశాస్త్రి. బి. ఏ.